సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్‌గా..

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా నూజివీడు ట్రిపుల్ ఐటీ సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ గోపాలరాజు నియమితులయ్యారు. 8లో ▸



భళా.. వైద్య కళాశాల

ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుపై అన్నివర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇది సువర్ణాధ్యాయం అంటున్నారు. 8లో ▸



భక్తుల రద్దీ సాధారణం

ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో శనివారం భక్తులు రద్దీ సాధారణంగా ఉంది. ఆలయంలోని పలు విభాగాలు ఖాళీగా కనిపించాయి. 8లో ▸

కాపు కాసిన సంక్షేమం

- 34,642 మందికి కాపు నేస్తం
- రూ.51.96 కోట్ల అందజేత



భీమవరం కలెక్టరేట్‌లో కాపు నేస్తం లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం(ప్రకాశంచౌక్): కాపు, బలిజ, ఒంటరి, తెలగ మహిళల ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా ప్రభుత్వం ఏటా కాపునేస్తం పథకాన్ని అమలు చేస్తోందని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి అన్నారు. శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపు నేస్తం పథకం ప్రారంభ కార్యక్రమాన్ని భీమవరం కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా వీక్షించిన అనంతరం జిల్లాలో లబ్ధిదారులకు చెక్కు అందించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నాల్గో ఏడాది (2023-24) కాపు నేస్తం కింద జిల్లాలో 34,642 మంది మహిళలకు రూ.51.96 కోట్ల మేర లబ్ధి చేకూర్చారన్నారు. పథకం కింద ఏడాదికి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం అందిస్తోందన్నారు. జిల్లాలో 2020-21లో 24,199 మందికి రూ 36.31 కోట్లు, 2021-22లో 21,815 మందికి రూ.33.21 కోట్లు, 2022-23లో 31472 మందికి రూ.47.21 కోట్ల లబ్ధి చేకూర్చారన్నారు. నాల్గో విడతలో నియోజకవర్గాల వారీగా ఆచంటలో 3,276 మందికి రూ.491.40 లక్షలు, భీమవరంలో 4,693 మందికి రూ.703.95 లక్షలు, నరసాపురంలో 6,062 మందికి రూ.909.30 లక్షలు, పాలకొల్లులో 3,944 మందికి రూ.591.60 లక్షలు, తాడేపల్లిగూడెంలో 5,264 మందికి రూ.789.60 లక్షలు, తణుకులో 5,729 మందికి రూ.859.35 లక్షలు, ఉండిలో 4,092 మందికి రూ.613.80 లక్షలు, గణపవరం మండలంలో 1,582 మందికి రూ 237.30 లక్షల లబ్ధి చేకూర్చారన్నారు. ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.ప్రమీలారాణి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పట్నాల గౌరీ గణపతి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జగనన్న ఆరోగ్య సురక్ష పరిశీలన



తాడేపల్లిగూడెంలో పరిశీలిస్తున్న రాష్ట్ర నోడల్ అధికారి విజయలక్ష్మి

తాడేపల్లిగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి శనివారం పరిశీలించారు. పట్టణంలోని వీకర్స్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆమె సందర్శించారు. క్లస్టర్ వారీగా వలంటీర్, ఏఎన్ఎం, ఆశావర్కరు బృందంగా ఏర్పడి ప్రతి ఇంటా ఆరోగ్య సర్వే నిర్వహించాలన్నారు. ఈనెల 30న సర్వే పూర్తి చేసుకొని అర్బన్ సెంటర్ వద్ద జరిగే వైద్య శిబిరానికి హాజరుకావాలని ఆదేశించారు. అధికారులు సర్వే తీరును పరిశీలించాలన్నారు. పట్టణంలో సర్వేపై సంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సుధ, డీపీఎంఓ డాక్టర్ సుగుణరావు, డీపీఓ సురేష్ పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తులు

ఉండి: జిల్లాలోని రెండు ప్రభుత్వ, 16 ప్రైవేటు ఐటీఐల్లో నాల్గో విడత ప్రవేశాలకు ఈనెల 19న సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు శనివారం తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లోని ఐటీఐ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని 20లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. 22, 23 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, వివరాలకు ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో నేరుగా లేదా 08816 297093లో సంప్రదించాలని కోరారు.

ఎన్‌వైకే ఉపన్యాస పోటీలు

ఏలూరు రూరల్: కేంద్ర యువజన, క్రీడలశాఖ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉపన్యాస పోటీలు నిర్వహించామని జిల్లా యువ అధికారి దూలం కిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయనేతల త్యాగఫలాలు అంశంపై వర్చువల్ విధానంలో చేపట్టిన పోటీల్లో కొప్పిశెట్టి లహరి ప్రథమ, చింతాడ సౌమ్య ద్వితీయ, కొతారు అమూల్య తృతీయ స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. లహరి ఈనెల 20న గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిందని తెలిపారు.

కాపు జాతిని తాకట్టు పెట్టిన పవన్



పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్

ద్వారకాతిరుమల: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కాపు జాతిని టీడీపీ అధినేత చంద్రబాబు వద్ద తాకట్టు పెట్టాడని గోపాలపురం నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడు పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రశ్నించేందుకే రాజకీయాల్లోకి వచ్చానన్న పవన్ ప్రజాధనాన్ని దోచేసి జైలులో ఉన్న వ్యక్తికి ఊడిగం చేస్తున్నాడని విమర్శించారు. దివంగత కాపు నేత వంగవీటి రంగాను పొట్టనబెట్టుకోవడంతో పాటు కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని ఇబ్బందులు పెట్టి, కాపు జాతిని అణగదొక్కిన తెలుగుదేశం పార్టీతో పవన్ పొత్తుపెట్టుకోవడం నీతిమాలిన చర్య అన్నారు. టీడీపీతో పొత్తు అనగానే అత్యధిక శాతం కాపులు జగన్‌కు జై కొడుతున్నారని, ఈ దెబ్బతో పవన్ భవిష్యత్ అంధకారమవడం ఖాయమన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలకు కాలం చెల్లిందని, అది వచ్చే ఎన్నికల్లో రుజువవుతుందని చెప్పారు.

19న కేసుల విచారణ

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఈనెల 18న వినాయక చవితి సెలవు దినంగా ప్రకటించారని రెండో అడిషనల్ జిల్లా జడ్జి వాసుదేవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా 18న విచారించాల్సిన అన్ని సివిల్, క్రిమినల్ కేసుల వాదనలు మరుసటి రోజు 19న విచారిస్తారని ఆయన పేర్కొన్నారు.

ఈ-స్టాంపింగ్‌తో రిజిస్ట్రేషన్ ఈజీ

- అందుబాటులోకి ఈ-స్టాంప్ సేవలు
- కార్డుఫ్రైమ్ సాఫ్ట్‌వేర్‌తో ఈ-స్టాంపింగ్
- 'పశ్చిమ'లోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు
- స్టాంపుల కొరత, నకిలీలకు అడ్డుకట్ట





భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఈ-స్టాంపింగ్ చేస్తున్న సిబ్బంది, ఈ స్టాంప్ పేపర్

భీమవరం(ప్రకాశం చౌక్): స్టాంపుల కొరత పేరిట దోపిడీ, నకిలీ స్టాంపులకు చెక్ పెడుతూ ప్రభుత్వం నూతనంగా కార్డ్‌ప్రైమ్ సాఫ్ట్‌వేర్ ఈ-స్టాంపింగ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా సేవలను అందించడమే లక్ష్యంగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఆధునిక సాంకేతికతతో కార్డ్‌ప్రైమ్ సాఫ్ట్‌వేర్, ఈ-స్టాంపింగ్‌ను తీసుకువచ్చింది. ఈ-స్టాంప్‌తో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా జరుగుతుంది. రిజిస్ట్రేషన్ శాఖలో ఇది గొప్ప మార్పుగా పలువురు భావిస్తున్నారు. నిమిషాల వ్యవధిలో ఈ-స్టాంప్ చేతికిరావడంతో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్న వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అపోహలు వద్దు

పాత పద్ధతిలో లభించే స్టాంపులపై జరిగే రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అలవాటు పడినవారు ఈ-స్టాంపింగ్‌పై ఆస్తుల కొనుగోలు, అమ్మకాలపై అపోహపడుతున్నారు. ఈ-స్టాంపింగ్‌పై ఎలాంటి అనుమానాలు పడవద్దని సబ్ రిజిస్ట్రార్లు చెబుతున్నారు. నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్‌పై డాక్యుమెంట్ తయారుచేసిన దాని విలువ ఎంతో ప్రస్తుతం ఈ-స్టాంపింగ్‌పై తయారుచేసిన డాక్యుమెంట్ విలువ అంతే ఉంటుందని అంటున్నారు. ఫిజికల్ డాక్యుమెంట్, సాఫ్ట్‌కాపీ రెండూ జీవిత కాలం అటు ఆన్‌లైన్‌లో, ఇటు మాన్యువల్‌గా అత్యంత పారదర్శకతతో భద్రతతో కూడి ఉంటాయని, అలాగే డబుల్ రిజిస్ట్రేషన్లు, తప్పుడు రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉండదని చెబుతున్నారు. నూతన రిజిస్ట్రేషన్ విధానంలో ఫిజికల్ డాక్యుమెంట్లు ఇవ్వరనేది అపోహ మాత్రమే అని ఈ-స్టాంప్ పేపర్‌పై డిజిటల్ సంతకం చేసిన ప్రింట్ జతచేసి ఇస్తారని అంటున్నారు.

15 కార్యాలయాల్లో..

పశ్చిమగోదావరి జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నా యి. ఆయా కార్యాలయాల పరిధిలో ఈ-స్టాంపులు విక్రయిస్తున్నారు. అలాగే 535 వార్డు, గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సౌకర్యం ఉంది. మ్యారేజ్, ఓటీఎస్, టిడ్కో ప్లాట్ల తదితర రిజిస్ట్రేషన్లు ఇక్కడ చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్లు సులువు



ఆన్‌లైన్‌పై అవగాహన ఉన్న వారు కార్డ్‌ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లో సులువుగా డాక్యుమెంట్ తయారు చేసుకోవచ్చు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, గ్రామ, వార్డు సచివాలయానికి వెళ్లి మిగిలిన ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ-స్టాంపింగ్ ప్రక్రియ అందుబాటులో ఉంది. దీనిపై ఆందోళన అవసరం లేదు. ఈ విధానం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి వ్యయ, ప్రయాసలు తగ్గుతాయి.

-ఆర్.సత్యనారాయణ, జిల్లా రిజిస్ట్రార్

ప్రయోజనాలెన్నో..

- కార్డ్‌ప్రైమ్ సాఫ్ట్‌వేర్ ద్వారా దస్తావేజులను వినియోగదారులు స్వయంగా రూపొందించుకోవడంతో పాటు రిజిస్ట్రేషన్ చార్జీలు సైతం ఆన్‌లైన్ ద్వారా చెల్లించుకోవచ్చు.
- అనుకూలమైన సమయాల్లో రిజిస్ట్రేషన్ టైమ్ స్లాట్ బుక్ చేసుకునే సౌలభ్యం ఉంది.
- వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి, ఈ-సైన్ సౌకర్యంతో డాక్యుమెంట్‌కు మరింత భద్రత.
- వ్యవసాయ భూములకు వెంటనే రెవెన్యూ రికార్డుల్లో పేరు మార్పుచేసే వెసులుబాటు.
- ఫోర్జరీ, నకిలీ డాక్యుమెంట్ల నిర్మూలనకు తోడ్పాటు.
- స్టాంపుల కొరత, నకిలీలు, పాత తేదీల స్టాంపులకు చరమగీతం పాడే అవకాశం.
- స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ (ఎస్‌హెచ్‌సీఎల్) బ్రాంచీల స్టాంప్ వెండర్లు, కామన్ సర్వీస్ సెంటర్లలో (సీఎస్‌సీ) ఈ-స్టాంపింగ్ సేవలు ఉంటాయి.
- రిజిస్ట్రేషన్ దస్తావేజుకి ఐటీ యాక్ట్-2000 ప్రకారం పూర్తిస్థాయి చట్టబద్ధత, భద్రత.
- అందుబాటులోకి రానున్న డిజిటల్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్, ఫిజికల్ డాక్యుమెంట్‌తో సమానంగా డిజిటల్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్ గుర్తింపు.
- డాక్యుమెంట్ ఒరిజినాలిటీ పరిశీలన సులభం.
- బ్యాంకులు, ఇతర సంస్థలు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను ఆన్‌లైన్ ద్వారా సులభంగా పరిశీలించుకునే అవకాశం ఉంటుంది.

కాపుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఆళ్ల నాని, ఎమ్మెల్యే



ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో కాపు వర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభ్యున్నతి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. వరుసగా నాలుగో ఏడాది కాపు నేస్తం నిధులు విడుదల చేసిన సందర్భంగా శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఏలూరు నియోజకవర్గంలో 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు గల 1,612 మంది కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల మహిళలు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున రూ. 2,41,80,000 లబ్ధి చేకూరిందన్నారు. నియోజకవర్గంలో నాలుగేళ్లలో ఒక్కొక్కరికీ రూ.60 వేల చొప్పున సుమారు రూ.9 కోట్ల మేర ప్రయోజనం కలిగిందన్నారు. నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల్లో కాపు వర్గాలకు ప్రభుత్వం సముచిత ప్రాధాన్యమిస్తోందన్నారు. కుల, మత, రాజకీయ వివక్షకు తావులేకుండా అందరికీ మేలు చేస్తున్న సీఎం జగన్ గెలుపు కోసం ప్రతిఒక్కరూ పనిచేయాలని పిలుపు నిచ్చారు.

పీటీ అండ్ ఎస్‌ఏ అసోసియేషన్ ఎన్నిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లా పీఈటీ అండ్ ఎస్ఏ (పీఈ) అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎ.సాయి శ్రీనివాస్, ఐ.రమేష్ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక సురేష్‌చంద్ర బహుగుణ స్కూల్ ఆడిటోరియంలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత 2023-24కి సంబంధించిన స్కూల్‌గేమ్స్ జిల్లా ఎంపికల తేదీలను ఖరారు చేశారు. అనంతరం గ్రిగ్స్ స్పోర్ట్స్ నిర్వహణ తేదీల నిర్ణయం, జోనల్స్ ఏర్పాటుచేశారు. డీఈఓ తరపున అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.షరీఫ్, ఎం.మనోహర్, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి డీబీ రాజేంద్రప్రసాద్, పీఈటీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయిశ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.


మట్టి ప్రతిమలను పూజిద్దాం.. కాలుష్యాన్ని అరికడదాం

- సాక్షి మీడియా ఆధ్వర్యంలో 'చిన్నారుల చేతుల్లో మట్టి గణపతి'
- పర్యావరణ ప్రాముఖ్యతను తెలియజేసేలా కార్యక్రమం
- సహకరించిన ఏపీ కాలుష్య నియంత్రణ మండలి





మొదటి స్థానంలో నిలిచిన విగ్రహం



ద్వితీయ స్థానంలో నిలిచిన ప్రతిమ





వినాయక ప్రతిమలు తయారు చేస్తున్న విద్యార్థులు, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న భీమవరం మున్సిపల్ కమిషనర్ శ్యామల, విజేతలతో ఆర్డీఓ దాసి రాజు

సాక్షి, భీమవరం: సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త నిర్వహణలో 'చిన్నారుల చేతుల్లో మట్టి గణపతి' కార్యక్రమం శనివారం భీమవరంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ గరల్స్ (పీఎస్ఎం) హైస్కూల్‌లో ఉత్సాహంగా జరిగింది. మట్టి గణపతి ప్రతిమలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం నినాదంతో నిర్వహించిన శిక్షణ శిబిరానికి ముఖ్య అతిథిగా భీమవరం ఆర్డీఓ దాసి రాజు హాజరయ్యారు. వినాయక ఉత్సవాల్లో రంగులు, రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలను వినియోగించడం వల్ల జల, వాతావరణ కాలుష్యమేర్పడుతుందని, అందరూ మట్టి ప్రతిమలను వినియోగించాలన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. మట్టి విగ్రహాలను వినియోగించేలా విద్యార్థులు తల్లిదండ్రులు, ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కాలుష్య నియంత్రణకు సాక్షి మీడియా చేపట్టిన కార్యక్రమం అభినందనీయమని కొనియాడారు. ముందుగా మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల జ్యోతి ప్రజల్వనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రకృతి ప్రసాదించిన నదీ జలాలు, వాతావరణాన్ని కాలుష్యం బారి నుంచి రక్షించేందుకు మట్టి ప్రతిమలను సంప్రదాయబద్ధంగా పూజించాలన్నారు. సుమారు 220 మంది విద్యార్థులు మట్టితో వినాయక ప్రతిమలు తయారు చేసి ఆకట్టుకున్నారు. టి.ప్రసన్న, హేమశ్రీ, శ్రీలక్ష్మిహరి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వర్ష, ప్రద్యుమ్మవర్మ, మానస ప్రియ, బి. సాయిహర్షిణి, బేబి సాయిహర్షిణి, డి.లక్ష్మి, కె.వర్షిణి కన్సొలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. వీరందరూ ఆర్డీఓ దాసి రాజు చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు. హెచ్ఎం జె.సుధారాణి, టీచర్లు వారణాసి రాధాకృష్ణ, పి.చిట్టి కుమారి, ఎన్‌కేఎస్ఎస్ మహాలక్ష్మి, పి.శ్రీదేవి, అల్లు శ్రీనివాస్, మలిశెట్టి సాయిబాబా, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ సరోజని పాల్గొన్నారు.

భళా.. ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాల

- హేలాపురి చరిత్రలో సువర్ణాధ్యాయం అంటూ ప్రజల హర్షాతిరేకాలు
- సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే ఆళ్ల నానిలకు అభినందనల వెల్లువ

ఏలూరు (టూటౌన్): హేలాపురి ప్రజల ఆకాంక్షను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే ఆళ్ల నాని నెరవేర్చారంటూ నగరవాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు నగరవాసుల చిరకాల స్వప్నమైన మెడికల్ కాలేజీని ఈ నెల 15న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావడంపై అభినందనలు తెలియజేస్తున్నారు. రాష్ట్రంలో ఏలూరుతో పాటు ఒకేసారి ఐదు మెడికల్ కాలేజీలు ప్రారంభించడం చారిత్రాత్మకమంటూ కొనియాడుతున్నారు. ప్రభుత్వ చర్యలతో అందని ద్రాక్షలా ఉన్న వైద్య విద్య సాధారణ పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులోకి వచ్చిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హేలాపురి సిగలో కలికి తురాయిలా వైద్య కళాశాల నిలిచిపోతుందని, ఇంతటి ఘనతకు కారణమైన సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే ఆళ్ల నానిలకు నగర వాసులు జేజేలు పలుకుతున్నారు. అడగకపోయినా ప్రజలకు ఏమి కావాలో తెలుసుకుని వారి ఆకాంక్షలను నెరవేరుస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. ఏలూరులో వైద్య కళాశాల, బోధనాసుపత్రి ఏర్పాటుతో పేదవర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినట్లేనని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన కొందరి అభిప్రాయాలు వారి మాటల్లోనే తెలుసుకుందాం.



ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాల భవనం


కళాశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు తదితరులు (ఫైల్)

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రభుత్వం



ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం పనిచేయడం గొప్ప విషయం. అడగకుండానే ప్రజల అవసరాలను తీరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల నానిలకు ధన్యవాదాలు. పేదలకు సైతం వైద్య విద్య అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంది. ఏలూరు నగర వాసులు సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే ఆళ్ల నానిలకు ఎంతో రుణపడి ఉంటారు.

– లక్కోజు రాజగోపాలాచారి, అధ్యక్షులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్

ఏలూరు చరిత్రలో సువర్ణాధ్యాయం



రాష్ట్రంలోని ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికీ ఒక ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవడం చారిత్రాత్మకం. దీనిలో భాగంగా తొలి విడతలో ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం. ఏలూరులో వైద్య కళాశాల ప్రారంభించడం నగర చరిత్రలో సువర్ణాధ్యాయంగా చెప్పవచ్చు.

– డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం

ఏలూరు నగరం మరింత అభివృద్ధి



గత 30 సంవత్సరాలుగా ఏలూరు ప్రజలు ఎదురుచూస్తున్న మెడికల్ కాలేజ్ కల సాకారం అవ్వడం ఎంతో సంతోషంగా ఉంది. సీఎం వైఎస్ జగన్,ఎ మ్మెల్యే ఆళ్ల నాని ఏలూరు ప్రజల కలను సాకారం చేయడం అభినందనీయం. మెడికల్ కాలేజీ ఏర్పాటుతో ఏలూరు, పరిసర ప్రాంతాలకు వైద్యం అందుబాటులో ఉంటుంది. ఏలూరు నగరం మరింత అభివృద్ధి చెందుతుంది.

కె.శ్రావణ్ కుమార్, అధ్యక్షులు, నాగవంశీ సంఘం,ఏలూరు జిల్లా

ఈ ఘనత సీఎం వైఎస్ జగన్‌దే



ప్రతి పేదవానికీ అందుబాటులోకి వైద్యాన్ని తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుంది. ఏలూరు నగరంలో వైద్య కళాశాల, బోధనాసుపత్రిని ఏర్పాటు చేయడం ద్వారా వైద్య విద్యతో పాటు, మెరుగైన వైద్య సేవలను ప్రజల ముంగిటకు తెచ్చారు. వైద్య కళాశాల ఏర్పాటుతో పలువురు పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి వచ్చినట్లైంది.

– ఎస్ఆర్ విఠల్ కుమార్,రాష్ట్ర అధ్యక్షులు,ఏపీ బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్,ఏలూరు

క్లుప్తంగా

ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్‌గా గోపాలరాజు నియామకం


బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య గోపాలరాజు

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) రిజిస్ట్రార్‌గా నూజివీడు ట్రిపుల్ ఐటీ సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ ఆచార్య ఎస్ఎస్ఎస్వీ గోపాలరాజు నియమితులయ్యారు. ఈ మేరకు చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గోపాలరాజు శనివారం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. గోపాలరాజు గతంలో నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా, ఏవోగా, సీఈటీఎల్ఎస్ డైరెక్టర్‌గా మూడేళ్లు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ ఏవోగా పనిచేశారు. అలాగే ఏడేళ్లుగా అడ్మిషన్ల కన్వీనర్‌గా పనిచేస్తూ ట్రిపుల్ ఐటీ అడ్మిషన్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన గోపాలరాజును ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ఆచార్య విజయ్‌కుమార్ అభినందించారు.

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ సాధారణం


శ్రీవారి ఆలయంలో నామమాత్రంగా ఉన్న భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శనివారం భక్తులు రద్దీ సాధారణంగా ఉంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ప్రతి వారం వేలాది మంది భక్తులు చినవెంకన్నను దర్శిస్తుంటారు. అయితే వినాయక చవితి పండుగ ముందు రోజులు కావడంతో క్షేత్రానికి భక్తులు స్వల్ప సంఖ్యలో విచ్చేశారు. దీంతో మధ్యాహ్నం నుంచి ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కల్యాణకట్ట తదితర విభాగాలు ఖాళీగా కనిపించాయి. ఆదివారం సైతం క్షేత్రంలో భక్తుల రద్దీ సాధారణంగానే ఉండొచ్చని ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

లారీ ఢీకొని మహిళా కూలీ దుర్మరణం


బోడిగడ్ల చంటి మృతదేహం

భీమడోలు: సూరప్పగూడెం వద్ద జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో ఓ మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. వివరాలిలా ఉన్నాయి. సూరప్పగూడెంకు చెందిన బోడిగడ్ల చంటి (48) గుండుగొలను సమీపంలోని ఓ హోటల్‌లో రోజువారీ కూలీగా పనిచేస్తోంది. శనివారం పనికి బయలుదేరి జాతీయ రహదారిలోని సర్వీసు రోడ్డును నడుచుకుంటూ దాటుతుండగా గుర్తు తెలియని ఓ లారీ వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆ మహిళ ఘటనా స్థలంలోనే మృతి చెందింది. భీమడోలు హెచ్‌సీ డి.శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు అంబేడ్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ డి.శ్రీనివాస్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

నూజివీడు (ఆగిరిపల్లి): అనుమానాస్పద స్థితిలో చెరువులో పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ఆగిరిపల్లికి చెందిన కలవకొల్లు శ్రీరావులమ్మ (85) అనే వృద్ధురాలు స్థానికంగా ఉన్న కళంగి చెరువులో శనివారం ఉదయం శవమై స్థానికులకు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నంబూరి చంటిబాబు సిబ్బందితో వెళ్లి చెరువు నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వృద్ధురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా, మనవడి వద్ద నివాసం ఉంటోంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

గమనిక
సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బోధన సరే.. నోట్ పుస్తకాల్లో కనపడదేం

- ఉపాధ్యాయుల తీరుపై విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అసహనం
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడంపై ఆగ్రహం..
- పాలకొల్లులో పాఠశాలల తనిఖీ



అధికారులు, ఉపాధ్యాయులపై అసహనం వ్యక్తం చేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

పాలకొల్లు సెంట్రల్: బోధించిన పాఠాలు విద్యార్థుల నోట్ పుస్తకాల్లో రాసుకుంటున్నారో లేదో కూడా చూడాల్సిన కనీస బాధ్యత ఉపాధ్యాయులుగా మీకు లేదా అంటూ విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులను ప్రశ్నించారు. శనివారం పాలకొల్లులోని ఎస్‌కేపీ అండ్ టీవీఆర్ మునిసిపల్ ఉన్నత పాఠశాల, ఏఎస్ఎస్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, సీహెచ్ఆర్ అండ్ ఎస్‌పీ ప్రాథమిక పాఠశాల, డీఎన్నార్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ భవనం, 6వ సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు బోధించిన పాఠాలకు సంబంధించి విద్యార్థులు నోట్, వర్క్ పుస్తకాల్లో రాయకపోయినా అధికారులు గమనించకపోవడాన్ని తప్పుబట్టారు. కనీసం ఎంఈవో, డీవైఈవో, డీఈవో ఎవరూ తమ స్థాయిలో వారానికో, పక్షం రోజులకో, కనీసం నెలకోసారైనా పాఠశాలలను పర్యవేక్షిస్తున్నారా అంటూ నిలదీశారు. విద్యార్థుల జీవితాలపై శ్రద్ధ లేకపోతే ఎలా, పాఠశాలలను పర్యవేక్షణ చేసే సమయమే లేదా, అంత బిజీగా ఉంటున్నారా అంటూ నిలదీశారు. జిల్లాలో విద్యాశాఖ పనితీరు సున్నాగా ఉందన్నారు. ఇంత దారుణంగా ఏ జిల్లాలో లేదన్నారు. తాను ఇప్పటికి 100 పాఠశాలలను పరిశీలించానని, కనీసం మీరు మీ పరిధిలో ఉన్న పది స్కూళ్లైనా పర్యవేక్షణ చేశారా, ఉన్న 20 మంది విద్యార్థులపైనే శ్రద్ధ పెట్టలేకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. ఎస్‌కేపీ స్కూల్ విద్యార్థుల నుంచి వర్క్ పుస్తకాలు తీసుకుని ఆర్‌జేడీ జి.నాగమణిని తనిఖీ చేసి విద్యార్థులకు పుస్తకాలు అందించి నాకు సమాచారం ఇవ్వాలన్నారు. ఒక ప్రిన్సిపల్ సెక్రటరీ వస్తే రూట్ మ్యాప్ ఎలా రూపొందించాలో కూడా తెలియకపోవడం పనితీరుకు అద్దం పడుతోందంటూ విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీహెచ్ఆర్ అండ్ ఎస్‌పీ స్కూల్లో విద్యార్థుల పుస్తకాలు పరిశీలించి ఓకే అనడంతో అక్కడ ఉపాధ్యాయులు ఊపిరిపీల్చుకున్నారు. కళాశాలలో అధ్యాపకులపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎన్నార్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ భవనాన్ని పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాను ఒక వీడియో షేర్ చేశానని దానిని ఎంతమంది చూశారని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు, అధికారులు ఎవ్వరూ చూడలేదనడంతో అసహనంతో సచివాలయ ఉద్యోగులకు ఆ వీడియోను షేర్ చేశారు. కాకినాడ ఆర్‌జేడీ జి.నాగమణి, ఏపీసీ ఎస్ఎస్ఏ, ఏలూరు డీఈవో పి.శ్యామసుందర్, పశ్చిమగోదావరి జిల్లా డీఈవో ఆర్.వెంకటరమణ, డీవైఈవో ఎం.సత్యనారాయణ, డీవైఈవో డి.శ్రీరామ్ తదితరులు ఈయన వెంట ఉన్నారు.

వివాహితను వేధించిన వ్యక్తిపై కేసు

ఉండి: వివాహితను లైంగిక వేధింపులకు గురిచేసిన ఓ వ్యక్తిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఉండి మండలం అర్తమూరు గ్రామానికి చెందిన ఓ వివాహిత తన ఇంట్లో ఇంటరిగా ఉండటం గమనించిన అదే గ్రామానికి చెందిన కాయల సునీల్ అనే వ్యక్తి ఇంట్లో ప్రవేశించి తన కోరిక తీర్చాలంటూ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై కే గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బద్రీనాథ్ యాత్రలో జీలకర్రగూడెం మహిళ మృతి

కామవరపుకోట: బద్రీనాథ్ యాత్రకు వెళ్లిన జీలకర్రగూడెంకు చెందిన ఓ మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మరీదు సత్యవతి ఈ నెల 4న రాజమండ్రిలో కొంతమంది యాత్రికులతో కలిసి బస్సులో బద్రీనాథ్ యాత్రకు వెళ్లారు. కేదార్నాథ్, చార్‌దామ్ యాత్ర ముగించుకుని బద్రీనాథ్‌కి వెళుతున్న సమయంలో గురువారం సాయంత్రం ఆమెకు బీపీ తగ్గటంతో సమీప ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం సత్యవతి మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండగా, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సత్యవతితో పాటు ఆమె సోదరి మల్లేశ్వరి కూడా ఈ యాత్రకు వెళ్లారు. మృతురాలికి వ్యవసాయ కూలీ అయిన భర్త దుర్గారావు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో సత్యవతి మృతదేహాన్ని జీలకర్రగూడెం తీసుకురానున్నట్లు బంధువులు తెలిపారు.

కిడ్నాప్ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: తన భార్యను కిడ్నాప్ చేసినట్లు భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి శనివారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బయ్యనగూడెంకు చెందిన మనెల్లి విజయ్‌కుమార్, లక్ష్మీపురానికి చెందిన సీహెచ్ సాయిశ్రీలు ప్రేమించుకున్నారు. ఆగస్టు 2న అన్నవరం గుడిలో వివాహం చేసుకుని పట్టణంలోని బస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 13న స్థానిక అల్లూరి సీతారామరాజు పార్క్ వద్ద విజయ్‌కుమార్, సాయిశ్రీలు ఉండగా, లక్ష్మీపురం గ్రామానికి చెందిన దమ్మాడి సమీర్ యాదవ్ అనే వ్యక్తి కులం పేరుతో దూషించి సాయిశ్రీని కిడ్నాప్ చేశాడు. అలాగే చంపుతానని బెదిరించాడని బాధితుడు విజయ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నిందితుడిపై కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి యువకుడి గల్లంతు

చింతలపూడి: మండలంలోని డీఎస్‌రావుపేట సమీపంలోని వెంకటాద్రి చెరువులో ఒక యువకుడు గల్లంతైన ఘటన శనివారం చోటు చేసుకుంది. రాఘవాపురం గ్రామానికి చెందిన రాములు రాంబాబు(18) పిట్టలు పట్టుకుని జీవిస్తుంటాడు. బహిర్భూమికని వెంకటాద్రి చెరువుకెళ్లి ప్రమాద వశాత్తూ పడి గల్లంతయ్యాడు. గ్రామస్తులిచ్చిన సమాచారం మేరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని యువకుని కోసం గాలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై కె.ప్రసాద్ తెలిపారు.

క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడలు తిలకిస్తున్న పద్మావతి తదితరులు

తణుకు అర్బన్: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ హెచ్‌ఎం కె.పద్మావతి అన్నారు. తణుకు శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో శనివారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తణుకు నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు క్రీడా పోటీలను ఆమె పర్యవేక్షణలో వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ అథ్లెటిక్స్ సెలక్షన్స్‌లో విజయం సాధించిన క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కో–ఆర్డినేటర్ సంకు సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మానేపల్లి శ్రీనివాస్, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పిల్లలకు ఇంటి వద్దనే విద్య



దివ్యాంగునికి ఇంటి వద్ద విద్య అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అతి తీవ్ర వైకల్యం కలిగి, పాఠశాలకు రాలేని దివ్యాంగుల పిల్లలకు ఇంటి వద్దనే విద్య అందిస్తున్నామని భవిత సెంటర్ ఎస్కే బాల ఈశ్వరయ్య పేర్కొన్నారు. భవిత సెంటర్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని స్కూల్‌కు రాలేని దివ్యాంగుల విద్యార్థులల ఇళ్లకు వెళ్లి ప్రత్యేక విద్యను అందించారు. బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలకు ప్రత్యేక విద్యతో పాటు తల్లిదండ్రులకు, పిల్లలకు నేర్పించాల్సిన నైపుణ్యాలపై అవగాహన కల్పించామని చెప్పారు. సమగ్ర శిక్ష ద్వారా 2023–24 విద్యా సంవత్సరానికి దివ్యాంగుల పిల్లలకు అన్ని అలవెన్స్‌లు అందజేస్తున్నామని, ఉచిత సేవలను ప్రతి దివ్యాంగుల విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత



బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అత్తిలి: చెట్లను పెంచడం వల్ల ఓజోన్ పొరను రక్షించుకోవచ్చని పాఠశాల జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ ఓజోన్‌డే నిర్వహించారు. ఈసందర్భంగా సైన్సు ఉపాధ్యాయులు మాట్లాడుతూ భూమిపై ఓజోన్ ఒక కవచంలో ఉండి సూర్యుని నుంచి విడుదల అయ్యే అతినీలలోహిత కిరణాలను భూమిపైకి పడకుండా ఆపుతుందన్నారు. ఏసీలు, ఫ్రిజ్‌లు వాడకం తగ్గించడం వల్ల రిఫ్రిజిరెంట్స్ విడుదల చేసే క్లోరోఫ్లోరో కార్బన్స్ తగ్గుతాయని, అందువల్ల ఓజోన్ పొర దెబ్బతింటుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ పురుషోత్తం, ప్రసాద్, మల్లేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు చేయూతనివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న దళిత డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర ప్రభుత్వం డప్పు కళాకారులకు చేయూతనిచ్చి ఆదుకోవాలని దళిత డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డప్పు కళాకారుల సమావేశం నాయకులు తాడిగడప వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం హర్షం తెలిపారు. డప్పులు, గజ్జలు, దుస్తులు ఇతర వస్తువులు కోసం వ్యక్తిగత రుణాలు అందజేయాలని, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దిద్దే నాగేశ్వరరావు, ఉల్లింకల జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు సత్వర వైద్యం

- తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో హెచ్‌డీయూ విభాగం
- హైరిస్క్ కేసుల్లో అధునాతన వసతులతో వైద్యం



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో హెచ్‌డీయూ విభాగంలో చికిత్స పొందుతున్న బాలింతలు

తణుకు అర్బన్: గర్భిణులు, బాలింతలకు సంబంధించి హైరిస్క్ కేసుల్లో నాణ్యమైన సత్వర సేవలందించేందుకు తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు వైద్యులు, సిబ్బంది. ఆస్పత్రిలో ఇటీవలే ఏర్పాటు చేసిన హై డెపెండెన్సీ యూనిట్ (హెచ్‌డీయూ) విభాగంలో 8 బెడ్‌ల ద్వారా నాణ్యమైన అత్యున్నత వైద్యసేవలందిస్తున్నారు. గర్భం దాల్చిన రోజు నుంచి నెలలు నిండి ప్రసవం అయిన తర్వాత కూడా ఎటువంటి ప్రమాదకర పరిస్థితి వచ్చినా ఈ విభాగంలో చేర్చి సేవలందిస్తున్నారు వైద్యులు. 150 పడకలతో తణుకు చుట్టుపక్కల 100 గ్రామాల ప్రజలకు పెద్దదిక్కుగా ఉచిత సత్వర వైద్యసేవలందిస్తున్న తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో హెచ్‌డీయూ విభాగంలో అదనంగా అందుబాటులో ఉన్న 8 బెడ్‌ల ద్వారా సత్వర సేవలందుతున్నాయి. నిత్యం 4 బెడ్‌లలో బాధితులు వైద్య సేవలు పొందుతున్నారు.

హైరిస్క్ కేసులు ఇలా..

ప్రసవానికి వస్తున్న వారిలో కొందరికి రక్తపోటు, సుగర్, థైరాయిడ్, తీవ్ర జ్వరం, రక్తస్రావం, అబార్షన్ వంటి ఇబ్బందులతో ఆస్పత్రికి వచ్చే వారిని గతంలో హుటాహుటిన ఏలూరు, కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించేవారు. కానీ తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఇటీవల ప్రత్యేకంగా ఏసీ వార్డులో ఏర్పాటు చేసిన వసతులు బాధితులను అక్కున చేర్చుకుంటున్నాయి. ఈ విభాగంలో అధునాతన సౌకర్యాలతో పాటు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చారు.

హెచ్‌డీయూతో అత్యవసర సేవలందిస్తున్నాం



హెచ్‌డీయూ విభాగం ద్వారా హైరిస్క్‌గా వస్తున్న గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. ఆస్పత్రిలో ప్రత్యేక ఏసీ వార్డును తీర్చిదిద్ది అధునాతన వసతులతో ఈ సేవలు అందుతున్నాయి. ముఖ్యంగా తణుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి రక్తపోటు, సుగర్, తీవ్ర జ్వరం, రక్తహీనత వంటి లక్షణాలతో వచ్చే గర్భిణులు, బాలింతలకు సత్వర సేవలు అందిస్తున్నాం. ఆస్పత్రి నుంచి రిఫరల్ కేసులను తగ్గించేందుకు మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఈ విభాగం ఏర్పాటుకు కృషిచేశారు.

– డాక్టర్ వెలగల అరుణ, జిల్లా కేంద్ర ఆస్పత్రి, తణుకు

అత్యవసర పరిస్థితుల్లో వచ్చాం



నా మనవరాలు పావనికి ప్రసవానంతరం ఇబ్బంది తలెత్తడంతో తణుకు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చాం. అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన మాకు ఆస్పత్రి వైద్యులు మంచి వైద్యసేవలందించారు. ఇప్పుడు మా పాప ఆరోగ్యం చాలా బాగుంది.

– సీహెచ్ సత్యవతి, కొడమంచిలి

ఇబ్బంది తప్పింది



నా కుమార్తె సుజి ప్రసవం కోసం ఖండవల్లి నుంచి తణుకు ఆస్పత్రికి తీసుకువచ్చాం. ప్రసవ సమయంలో ఇబ్బంది రాగా వెంటనే ఆస్పత్రిలోని హెచ్‌డీయూ విభాగంలో ఉంచి వైద్యులు మంచి వైద్యసేవలందించారు. నా కుమార్తె పండంటి బాబును జన్మనిచ్చి ఆరోగ్యంగా ఉంది.

– కొల్లి వెంకన్నబాబు, ఖండవల్లి

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. శనివారం మండలంలోని నవాబుపాలెం గ్రామంలో వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. లార్వా దశలోనే దోమలను నిలువరించాలని సూచించారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉన్నా వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య కార్యదర్శి వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ ఆషా లత, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్‌ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని శనివారం 10, 12, 24 వార్డులలో వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలను హెల్త్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ర్యాలీలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పరిశీలనలు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు మేరీ, జయభారతి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ప్రసాద్‌బాబు, ఆశలు, అంగన్‌వాడీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- అలంపురంలో లబ్ధిదారులకు ఇళ్లపట్టాల పంపిణీ



అలంపురం గ్రామంలో మహిళకు ఇంటి పట్టా అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు.అలంపురంలో శుక్రవారం రాత్రి 12 గంటల వరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి మేలు చేసే నాయకుడ్ని ప్రజలు సదా గుర్తించుకోవాలని తెలిపారు. అభిమానాన్ని చాటుకోవడంలో తప్పులేదని, కానీ అదే సమయంలో అభిమానాన్ని తాకట్టు పెట్టవద్దన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు మావోడు, పవన్ మా అభిమాన నటుడు అని గుడ్డిగా ఓటు వేస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. ఇప్పటి వరకు కులం, మతం, ప్రాంతం, పార్టీల బేధాలు లేకుండా ప్రజలందరికి మేలు చేసేలా జగనన్న రాష్ట్రానికి ఎంతో మేలు చేశారన్నారు. ఎంతో కాలంగా ప్రధాన సమస్య అయిన గూడులేని పేదలకు సొంతఇంటి నిర్మాణం కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గ్రామంలో ఎన్నో ఏళ్లగా నివాసాలు ఏర్పరుచుకొని పట్టాల కోసం ఎదురు చూస్తున్న 74 మందికి మంత్రి కొట్టు సత్యనారాయణ పట్టాలు అందించి వారి మొములో చిరునవ్వు చూశారు. ధర్మం పక్షాన నిలబడి పేద ప్రజల కోసం పోరాడే నాయకుడైన జగనన్నకు భగవంతుడు అన్ని రకాలుగా సహకరిస్తున్నాడన్నారు. మీరందరూ రాబోయే ఎన్నికల్లో జగనన్నకు పూర్తి అవకాశం ఇచ్చేలా పాటుపడాలన్నారు. పవన్ కల్యాణ్ కేవలం తన స్వార్థం కోసం కార్యకర్తలను బలి చేస్తున్నాడన్నారు. జనసేనకు ఓటు వేస్తే టీడీపీకి ఓటు వేసినట్టేనని ప్రజలు గుర్తించాలన్నారు. దేశంలోనే ఈ రోజు ఆదర్శపాలన అందిస్తున్న సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. జన సైనికులు, వీరమహిళలు ఇది గుర్తించి రాబోయే ఎన్నికల్లో పవన్‌కు గుణపాఠం చెప్పాలన్నారు.

అర్హులందరికీ నూరుశాతం సంక్షేమ పథకాలు అందించాలి

తణుకు టౌన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల సంక్షేమ విద్యా సహాయకులు పూర్తి అవగాహనతో మెలగాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారిణి కే శోభారాణి చెప్పారు. శనివారం తణుకులోని సాంఘీక సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహంలో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ అర్హులైన వారందరికీ నూరు శాతం సంక్షేమ ఫలితాలు అందేలా సహాయకులు కృషి చేయాలని కోరారు. లబ్ధిదారుల పట్ల సహాయకులు అవగాహనతో మెలగాలని కోరారు. ఈ సందర్భంగా జీవో నెంబరు 46 గురించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో తణుకు సహాయ సాంఘీక సంక్షేమాధికారిణి పీ నాగసాయమ్మ, మండల సమన్వయ అధికారులు కేవీ నరసమ్మ, ఎంవీ సూర్యనారాయణ, జీ ఫణికుమార్, వై అరుణ, రామకృష్ణ, సీహెచ్ కమల తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0

భీమవరం(ప్రకాశం చౌక్): స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ వారి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం భీమవరంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఎం. శ్యామల పర్యవేక్షణలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. గరగపర్రు రోడ్డులోని రైల్వే అండర్ టర్నల్ లోపల గోడలపై మున్సిపల్ ఎయిడెడ్ హైస్కూల్ విద్యార్థులతో ఇరువైపులా వాల్ పెయింటింగ్స్ వేయించారు. గునుపూడి సోమేశ్వరస్వామి వారి దేవస్థానం ఎదరుగా ఉన్న సోమగుండం చెరువు చుట్టూ ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు.

మంత్రి కారుమూరిని కలిసిన ఎమ్మెల్సీ జయ మంగళ



తణుకులో మంత్రి కారుమూరిని కలిసిన ఎమ్మెల్సీ జయ మంగళ వెంకట రమణ

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కారుమూరిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ఇరగవరం: రక్తహీనత నివారణకు గర్భిణులు, బాలింతలు ప్రతి రోజు చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యాంబ తెలిపారు. ఇరగవరం మండలంలో పోషణ మాసోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్త హీనతకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఆకు కూరలు, పాలు,గుడ్లు, వంటివి తీసుకోవడం వల్ల రక్తహీనత నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు. ఐరన్, పోషకాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వై సాయిగిరి రెడ్డి, సిబ్బంది అనంత లక్ష్మీ, ఎంపీహెచ్‌వో, ఏఎస్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా భుజించాలి

అత్తిలి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహార పదార్థాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు దారం శిరీషా అన్నారు. తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి మంచిలి సెక్టార్‌పరిధిలోగల అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శనివారం మంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సెక్టార్ సూపర్‌వైజర్ పి మహాలక్ష్మి అధ్యక్షతన పౌష్టికాహారంపై అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మహాలక్ష్మి మాట్లాడుతూ పోషణ పక్వాడ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు, చిరుధాన్యాలను గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ వెంకటరమణ , అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రేలంగి శివారు కేతావారిపాలెంలో రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



అత్తిలి మండలం మంచిలిలో సెక్టార్ సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ మహాలక్ష్మి

పరిశోధనా ఫలితాలు క్షేత్రస్థాయికి చేరాలి

తాడేపల్లిగూడెం: పరిశోధనా ఫలితాలు క్షేత్రస్థాయికి చేరినప్పుడే వాటికి సార్థకత లభిస్తుందని ఏపీ నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కె.శాస్త్రి అన్నారు. ఇంజనీర్స్‌డే వేడుకల్లో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేశభవిష్యత్ యువతరానిదే అన్నారు. చరిత్రలో నిలిచిపోయే ఆవిష్కరణల రూపకల్పనకు పాటు పడాలన్నారు. జాబిల్లి దక్షిణ ధృవంపై తొలిసారి పరిశోధనా వెలుగును ప్రసరింప చేసిన ఘనత భారత శాస్త్రవేత్తలకే దక్కుతుందన్నారు. వారి స్ఫూర్తితో కొత్తకొత్త ప్రాజెక్టులను చేపట్టాలని కోరారు. ఏఐఅండ్ రోబోటిక్స్ క్లబ్ కో ఆర్డినేటర్ ఫణికృష్ణ కర్రి మాట్లాడుతూ యువత తమలో దాగి ఉన్న అపారశక్తులను బయటకు తీసి ఆధునిక కాలానికి తగిన నైపుణ్యాలను పుణికి పుచ్చుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డీన్ పి.శంకర్, వి.సందీప్, కిరణ్‌కుమార్, హిమబిందు, టి.రమేష్, కిరణ్‌తీపర్తి, నగేష్‌భట్టు, సుదర్శన దీప తదితరులు పాల్గొన్నారు.

యువత సీఎం జగన్‌కు అండగా నిలవాలి



తణుకులో మంత్రి కారుమూరిని కలిసిన యూత్, స్టూడెంట్ వింగ్స్ యువకులు

పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డైనమిక్ పాలనను యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఇటీవలే నూతనంగా ఎన్నికైన ఇరగవరం మండలం ఏలేటిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ స్టూడెంట్ వింగ్, యూత్ వింగ్ యువకులు శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కారుమూరిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయన మాట్లాడుతూ పట్టుదల, అనుకున్న లక్ష్యాన్ని ఛేదించడంలో సీఎం జగన్ జీవన విధానం స్ఫూర్తిదాయకమని స్పష్టం చేశారు. పేదలపాలిట నిలబడ్డ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, పెత్తందార్లకు అండగా నిలబడ్డ చంద్రబాబు, దత్తపుత్రుడులతో యుద్ధం చేస్తున్నారని యువతరమంతా జగనన్నకు అండగా నిలబడాల్సిన రోజులు వచ్చాయని పిలుపునిచ్చారు. విద్యావిధానంలో మీ జగనన్న విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన పరిస్థితులను గ్రామాల్లో ప్రజానీకానికి, తోటి యువతకు వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఇటీవల ఎన్నికైన యూత్ వింగ్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షులను మంత్రి కారుమూరి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు గుడిమెట్ల సాయిరామకృష్ణారెడ్డి, యూత్ వింగ్ అధ్యక్షుడు ద్వారంపూడి హరి నాగ సూర్యరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ తణుకు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పులగం సూర్యనారాయణరెడ్డి, ఏలేటిపాడు గ్రామ అధ్యక్షుడు నల్లమిల్లి బాలకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఇరగవరం మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, ఇరగవరం జేసీఎస్ కన్వీనర్ మేడపాటి దినేష్‌రెడ్డి, నాయకులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, చోడే జోషి, గంజి సతీష్, యువకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సహస్ర గళార్చన

తణుకు టౌన్: మాతృ బాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సహస్ర పద్యాలు, సహస్ర గళార్చన కార్యక్రమం శనివారం తణుకులో ఉత్సాహంగా నిర్వహించారు. తణుకులోని బోగవల్లి బాపయ్య అన్నపూర్ణమ్మ కమ్మ కల్యాణ మండపంలో తణుకు పరిసర గ్రామాల్లోని 20 పాఠశాలలకు చెందిన 1008 మంది విద్యార్థినీ, విద్యార్థులు 1008 పద్యాలను రాగయుక్తంగా ఆలపించారు. ఈకార్యక్రమంలో మాతృ భాషా సేవా సమితి కన్వీనర్ సీహెచ్ వీఎస్ నాగభూషణం, సమితి అధ్యక్షుడు సీహెచ్ సుభాష్ చంద్రబోస్, లయన్స్ క్లబ్ గవర్నర్ జీ మాణిక్యాలరావు, ఒంటెద్దు రాజా, హైదవ ఫౌండేషన్ సభ్యులు, వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి



దర్శిపర్రు గ్రామంలో ఆరోగ్యసురక్షపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెంటపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జగనన్న ఆరోగ్యసురక్ష రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం దర్శిపర్రు గ్రామంలో ఆరోగ్యసురక్ష సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు అందించారు. ఈనెల 30న జరగబోయే జగనన్న ఆరోగ్యసురక్ష మెగా క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిపుణులైన వైద్యులు పలు సూచనలు అందించడంతో పాటు, రోగులను పరీక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి దేవసుధ, డిప్యూటీ వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సుగుణరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రక్రియను నిర్దేశించిన గడువులోపుగా పూర్తిచేయాలని జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె విజయలక్ష్మి వైద్యసిబ్బందిని ఆదేశించారు. అత్తిలి–3 సచివాలయం పరిధిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రక్రియను శనివారం ఆమె తనిఖీ చేసారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుగుణరాజు, డాక్టర్ సుధాదేవ, స్థానిక వైద్యాధికారులు డాక్టర్ కె నాగరాజు, డాక్టర్ ఆర్ సురేఖ, ఎంపీహెచ్‌ఏ మేల్ జెఎస్ గనిరాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఎన్‌పురం ఎంపీయూపీ స్కూల్‌లో వినాయక చవితి వేడుకలు



లక్ష్మీనారాయణపురం ఎంపీయూపీ స్కూల్‌లో వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

అత్తిలి: లక్ష్మీనారాయణపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం వినాయక చవితి వేడుకలను ఘనంగా జరిపారు. పాఠశాల విద్యార్థులు వినాయక ప్రతిమలను సొంతంగా తయారు చేసి, వాటితో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో వినాయక పూజను చేయించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీ సుబ్బరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వినాయక చవితి సందర్భంగా మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు జె త్రివిక్రమరావు, ప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దువ్వ సొసైటీకి అభినందనలు

తణుకు టౌన్: దువ్వ సొసైటీ పరిధిలో రైతుల నుంచి నూటికి నూరు శాతం బకాయిలు వసూలు చేసినందుకు గాను జిల్లా కేంద్ర బ్యాంక్ చైర్మన్ పీవీఎల్ నరసింహారావు అభినందించినట్లు దువ్వ సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు తెలిపారు. జిల్లా కేంద్రం ఏలూరులో జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో జరిగిన మహాజన సభలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పైడిపర్రు సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తిలు తదితరులు పాల్గొన్నారు.